సాక్షి
కామారెడ్డి
గురువారం । 11 । ఏప్రిల్ । 2024

నేడు రంజాన్



నెలవంక కనిపించడంతో ముస్లింలు గురువారం రంజాన్ పండుగ జరుపుకోనున్నారు. ప్రత్యేక ప్రార్థనల కోసం ఇప్పటికే ఈద్గాలను ముస్తాబు చేశారు.

ప్రత్యేక ప్రార్థనల కోసం ఎల్లారెడ్డిలోని ఈద్గా వద్ద ఏర్పాట్లు

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
39.7 /21.9

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎన్నికల పరిశీలకుల నియామకం

కామారెడ్డి క్రైం: జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులను ఎలక్షన్ కమిషన్ నియమించింది. ఎన్నికల సాధారణ పరిశీలకులుగా గోపాల్ జీ తివారి, పోలీసు పరిశీలకులుగా దీపక్ భార్గవ్‌ను ఎన్నికల కమీషన్ నియమించిందని కలెక్టర్ పాటిల్ తెలిపారు.

ఇద్దరు అధికారులకు మెమోలు



భిక్కనూరు: విధులను నిర్లక్ష్యం చేసిన ఇద్దరు అధికారులపై జెడ్పీ సీఈవో, డీఆర్‌డీవో చందర్‌నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన బుధవారం భిక్కనూరు మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సెలవు పెట్టకుండా విధులకు గైర్హాజరైన కార్యాలయ సూపరింటెండెంట్ రాజేందర్‌ప్రసాద్‌తోపాటు సమయ పాలన పాటించని జూనియర్ అసిస్టెంట్ రవికుమార్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి మెమోలు జారీచేశారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధి పనుల పరిశీలన

జెడ్పీ సీఈవో బుధవారం లక్ష్మీదేవునిపల్లిలో పర్యటించి, ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎండ తీవ్రత ఉన్నందున కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కూలీలు అధిక సంఖ్యలో పనుల్లో పాల్గొనేలా చూడాలన్నారు. అనంతరం గ్రామంలోని అక్వా యూనిట్‌ను సందర్శించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏపీవో రాధిక, ఏపీఎం శ్రీనివాస్ తదితరులున్నారు.

నేడు నిజామాబాద్ నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

ఖలీల్‌వాడి: రంజాన్ పండుగ సందర్భంగా గురువారం నిజామాబాద్ నగరంలో ట్రాఫిక్ మళ్లించనున్నట్లు సీపీ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ రోజు ఖిల్లా, బోధన్ బస్టాండ్, పులాంగ్ ఈద్గాలలో ముస్లింలు ప్రార్థనలు చేయనున్న నేపథ్యంలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని పేర్కొన్నారు. బోధన్‌వైపు వెళ్లే వారు ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఫ్లైఓవర్ బ్రిడ్జి, శివాజీ చౌక్, గంజ్, నిజాంకాలనీ మీదుగా అర్సపల్లి నుంచి వెళ్లాలన్నారు. హైదరాబాద్ నుంచి బోధన్ వైపు వెళ్లేవారు మాధవనగర్ బైపాస్ నుంచి కంఠేశ్వర్ బైపాస్, కలెక్టరేట్, అర్సపల్లి మీదుగా వెళ్లాలని పేర్కొన్నారు. బోధన్ నుంచి నిజామాబాద్‌కు అర్సపల్లి సర్కిల్ నుంచి కలెక్టరేట్ మీదుగా కంఠేశ్వర్ బైపాస్, ఎన్టీఆర్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లాల్సి ఉంటుందన్నారు.

ప్రచారానికి సన్నద్ధం

- ఎన్నికలకు సమీపిస్తున్న గడువు
- శ్రేణులను సమాయత్తం చేస్తున్న ప్రధాన పార్టీలు
- సమావేశాలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్న నేతలు
- నోటిఫికేషన్ తర్వాత జిల్లాలో మరింత పెరగనున్న రాజకీయ వేడి



లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నాయి. మరో 32 రోజుల్లో పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రచారంపై దృష్టి సారించిన ప్రధాన పార్టీలు.. శ్రేణులను సమాయత్తం చేయడానికి సమావేశాలు నిర్వహిస్తున్నాయి. నేతలు కార్యకర్తలకు దిశానిర్దేశం చేసేందుకు సుడిగాలి పర్యటనలు చేస్తుండడంతో రాజకీయం వేడెక్కుతోంది. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత రాజకీయ వేడి మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. – సాక్షి, కామారెడ్డి

జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సురేశ్ షెట్కార్, బీజేపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్ పోటీ చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జీలుగా కాంగ్రెస్ నుంచి మంత్రి దామోదర రాజనర్సింహ, బీజేపీ నుంచి కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యవహరిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో అభ్యర్థులతోపాటు ఆయా పార్టీల ఇన్‌చార్జీలు, ముఖ్య నేతలు కార్యరంగంలోకి దిగారు. ప్రచారానికి నెల రోజులే గడువు ఉండడంతో ముందుగా కార్యకర్తలను క్రియాశీలం చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఆయా పార్టీల నేతలు నియోజకవర్గ స్థాయితోపాటు మండల స్థాయిలలో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో మూడు ప్రధాన పార్టీలు కూడా క్యాడర్‌లో ధైర్యాన్ని నింపేందుకు ప్రయత్నిస్తున్నాయి.

క్షేత్ర స్థాయి ప్రచారంపై దృష్టి..

జిల్లాలోని ఆయా అసెంబ్లీ నియోజక వర్గాల్లో అభ్యర్థులతో కలిసి కార్యకర్తల సమావేశాలు నిర్వహించిన ప్రధాన పార్టీలు.. ఎన్నికల ప్రచారంపై ఫోకస్ చేస్తున్నాయి. ఎన్నికలకు నెల రోజుల సమయం మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో ఆయా పార్టీలు ప్రచారాన్ని ఉధృతం చేయడానికి ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయి. ఇప్పటికే ప్రచార రథాలను రంగంలోకి దించాయి. మూడు పార్టీల అభ్యర్థుల తరపున ప్రచార రథాలు ఊళ్లను చుట్టేస్తున్నాయి. ఎన్నికల ప్రచారానికి కావలసిన సామగ్రిని అభ్యర్థులు సిద్ధం చేస్తున్నారు. ఆయా నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు తమ ప్రాంతంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. నియోజక వర్గాల ఇన్‌చార్జీలే అన్నీ చూసుకునేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు.

బీఆర్‌ఎస్..

రాష్ట్రంలో పదేళ్ల పాటు అధికారంలో కొనసాగిన బీఆర్‌ఎస్ పార్టీ.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలై అధికారాన్ని కోల్పోయింది. దీంతో చాలా మంది నాయకులు పార్టీని వీడి బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో చేరారు. దీంతో శ్రేణులకు భరోసా ఇచ్చేందుకు ఆ పార్టీ నేతలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీ జహీరాబాద్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి హరీశ్‌రావుతోపాటు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి విస్తృతంగా పర్యటిస్తూ కార్యకర్తలు, నేతలను ఎంపీ ఎన్నికలకు సన్నద్ధం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్ సింధే సైతం కార్యకర్తలతో సమావేశమవుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోందని ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలని సూచిస్తూ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతున్నారు.



దోమకొండలో మాట్లాడుతున్న పోచారం

బీజేపీ..



కామారెడ్డిలో అభివాదం చేస్తున్న ఎంపీ పాటిల్, ఎమ్మెల్యే కేవీఆర్, బీజేపీ నేతలు

జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో ఇప్పటి వరకు బీజేపీ గెలవలేదు. ఈసారి ఈ స్థానంలో ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో ఉన్న ఆ పార్టీ నాయకత్వం.. హిందుత్వ ఎజెండా, అయోధ్య రామాలయ నిర్మాణంతోపాటు, మోదీ చరిష్మాను నమ్ముకుని ముందుకు సాగుతోంది. జహీరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి బీబీ పాటిల్‌తోపాటు పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి సమావేశాలు నిర్వహిస్తూ శ్రేణులలో ఉత్సాహం నింపుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించాలని సూచిస్తున్నారు. అన్ని అంశాలు కలిసివస్తాయని, ఈసారి జహీరాబాద్‌లో తప్పనిసరిగా కాషాయ జెండా ఎగురవేస్తామన్న నమ్మకాన్ని కార్యకర్తల్లో నింపుతున్నారు. ఇటీవల చేరికలు పెరగడంతో కాషాయ శ్రేణుల్లోనూ జోష్ పెరిగింది. జిల్లా అధ్యక్షురాలు అరుణతారతోపాటు సీనియర్ నాయకులు బాణాల లక్ష్మారెడ్డి, సుభాష్‌రెడ్డి తదితరులు సమావేశాలు నిర్వహిస్తూ కార్యకర్తలను ఎన్నికలకు సన్నద్ధం చేస్తున్నారు.

కాంగ్రెస్..

రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ.. పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇతర పార్టీలకు చెందిన నేతలను తమ వైపు లాక్కుంటోంది. పార్టీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి దామోదర రాజనర్సింహ నాయకులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతోపాటు ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి తదితరులు కార్యకర్తలతో సమావేశమవుతూ ఎన్నికలకు దిశానిర్దేశం చేస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలే గెలిపిస్తాయన్న ధీమాను కార్యకర్తల్లో నింపుతున్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజల వద్దకు వెళ్లాలని సూచిస్తున్నారు.



బిచ్కుందలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావ్

లిక్కర్ దందాలో మాయాజాలం

లిక్కర్ బ్రాండ్ల కొనుగోళ్లలో మద్యం వ్యాపారులు అక్రమ మార్గాలు అనుసరిస్తున్నారు. అనుమతి లేకున్నా హైదరాబాద్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసి తీసుకొస్తున్న మద్యాన్ని ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బార్‌లలో విక్రయిస్తున్నారు. ఫిర్యాదులు వస్తున్నా ఎక్సైజ్ శాఖ తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

- నిబంధనలు అతిక్రమిస్తున్న వ్యాపారులు
- సరి'హద్దులు' దాటొస్తున్న అక్రమ మద్యం
- మహారాష్ట్ర, కర్ణాటక, గోవా నుంచి తరలింపు
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో యథేచ్ఛగా అమ్మకాలు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



బాన్సువాడలోని ఓ బార్‌లో వేరే బార్‌కోడ్స్ ఉన్న లిక్కర్ బాటిల్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: మద్యం వ్యాపారుల్లో చాలామంది కల్తీకి పాల్పడుతున్నారంటూ అనేక ఫిర్యాదులు వస్తున్నప్పటికీ అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. లిక్కర్ బ్రాండ్ల కొనుగోలులోనూ మద్యం వ్యాపారులు అక్రమ మార్గాలు అనుసరిస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో పైకి అంతా బాగానే కనిపిస్తున్నా.. మద్యం వ్యాపారులు చాలా చాకచక్యంగా మాయాజాలం చేస్తున్నారు. చాలా పద్ధతిగా వ్యాపారం చేస్తున్నట్లు బిల్లులు మాత్రం ఇస్తున్నారు. అదేవిధంగా ప్రభు త్వం నిర్వహించిన లాటరీ ద్వారా దుకాణాలు, బార్లు దక్కించుకున్నామని, పారదర్శకంగా వ్యాపారాలు చేస్తున్నామని వ్యాపారులు పేర్కొంటున్నా రు. లోనికి వెళ్లి తరచి చూసినవారికి మాత్రమే వీళ్ల 'జాదూ' వ్యవహారాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఆర్మూర్, బాన్సువాడ, నిజామాబాద్, బోధన్, కామారెడ్డి తదితర ప్రాంతాల్లో లిక్కర్ వ్యాపారులు చేస్తున్న అక్రమాలు అంతా ఇంతా కాదు. నిబంధనలను పూర్తిగా అతిక్రమించి వ్యాపారాలు నిర్వహి స్తూ మందుబాబులను కిక్కులోకి దించుతున్నారు. వీళ్లేమో అనేక రెట్ల లాభాల ఎంజాయ్ చేస్తున్నారు.

ఐఎంఎల్ డిపో పరిధిని దాటుకుని..

ఉమ్మడి జిల్లాలోని లిక్కర్ వ్యాపారులు మాక్లూర్ మండలంలోని ఐఎంఎల్ డిపో నుంచి మాత్రమే మద్యం స్టాక్ తెచ్చుకోవాలి. వేరే డిపోల నుంచి తెచ్చుకోవాలంటే సదరు దుకాణాలు ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అయితే ఉమ్మడి జిల్లాలో అలాంటి రిజిస్ట్రేషన్ చేసుకున్న వైన్స్, బార్‌లు లేవు. అయినప్పటికీ కొందరు వ్యాపారులు హైదరాబాద్ నుంచి స్టాక్ తెచ్చుకుంటున్నారు. ఇలా తెచ్చుకునే అవకాశం కేవలం టానిక్స్, ఎలైట్ బార్ వాళ్లకు మాత్రమే ఉంది. కాగా లాటరీ పద్ధతిలో లైసెన్స్‌లు పొందినవారు కూడా ఇతర ప్రాంతాల నుంచి స్టాక్ తెచ్చుకుంటున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. తాజాగా బాన్సువాడలోని ఓ బార్‌లో ఇలా నిబంధనలను అతిక్రమించి హైదరాబాద్ నుంచి తెచ్చిన మద్యం అమ్ముతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి.

- లాటరీ పద్ధతిలో లైసెన్స్ పొందిన లిక్కర్ వ్యాపారులు కొందరు మహారాష్ట్ర, కర్ణాటక, గోవా రాష్ట్రాల నుంచి మద్యం తీసుకొచ్చి ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నారు. అటు మందుబాబులను దోపిడీ చేస్తూ ఇటు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో కొందరు వ్యాపారులు తీసుకొచ్చిన గోవా మద్యాన్ని హైదరాబాద్‌లో పట్టుకున్నారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల వేళ ఉమ్మడి జిల్లాలో పలువురు గోవా మద్యం తీసుకొచ్చి అమ్మకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరికొందరైతే విదేశీ మద్యాన్ని తీసుకొచ్చి అమ్ముతున్నారు. విదేశీ మద్యం తీసుకురావాలంటే రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. అలాంటి అనుమతులేవీ లేకుండానే విదేశాల నుంచి బ్రాండ్లను తీసుకొ చ్చి వైన్స్, బార్‌ల వ్యాపారులు దందా చేస్తున్నారు. ఈ విషయాలపై నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డిని వివరణ కోరగా 'వేర్ ఇట్' యాప్ ద్వారా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదులు వస్తే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నామన్నారు.

'సమన్వయంతో పనిచేయాలి'



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎన్నికల ప్రవర్తనా నియమావళి, అనుమతులు, ఓటింగ్ యంత్రాల తరలింపు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థి చేసే ప్రతి ఖర్చును లెక్కల్లో చూపించాల్సి ఉంటుందన్నారు. అనుమతులు లేని వాహనాలు, సభలు, సమావేశాలు, లౌడ్ స్పీకర్లతో పాటు డబ్బు, మద్యం, కానుకల తరలింపులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సి-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే డివిజన్‌ల వారీగా ఓటింగ్ యంత్రాలను తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల విధులు కేటాయించిన వారికి ఎలాంటి మినహాయింపు లేదన్నారు. రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు తదితర కార్యక్రమాలలో ఉద్యోగులు పాల్గొనరాదన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రమోహన్, శ్రీనివాస్‌రెడ్డి, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, నోడల్ అధికారులు వరదారెడ్డి, శ్రీనివాస్, అంబాజీ, శ్రీనివాస్‌రెడ్డి, రాజారాం, ఏవో మస్రూర్ అహ్మద్, ఎన్నికల పర్యవేక్షకులు ప్రేంకుమార్, ఇందిరా ప్రియదర్శిని, జ్యోతి, స్వప్న, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'జహీరాబాద్'లో వార్ వన్ సైడే

- కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్
- జిల్లా కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నేతలు, కార్యకర్తలు

కామారెడ్డి టౌన్: జహీరాబాద్ నియోజకవర్గంలో వార్ వన్ సైడే అన్నట్లుగా ఉందని, బీజేపీ అభ్యర్థి గెలవడం ఖాయమని కామారెడ్డి ఎమ్మెల్యే కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. దేవునిపల్లిలోని లక్ష్మి దేవి గార్డెన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా సిరిసిల్ల రోడ్‌లోని రాజారెడ్డి గార్డెన్‌కు చేరుకుంది. గార్డెన్‌లో బీజేపీ నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల నియంతృత్వ, అవినీతి పాలనను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. దేశాభివృద్ధి కోసం ప్రజలు మోదీ వైపే చూస్తున్నారన్నారు. జహీరాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను భారీ మెజారిటీతో గెలిపించడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించి ఓట్లు అడగాలని సూచించారు. ఒక్క కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలోనే బీజేపీకి 1.20 లక్షలకు మించి ఓట్లు వస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ అవినీతి మచ్చలేని పార్టీ బీజేపీ అన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే బీజేపీకే ఓటేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు నీలం రాజులు, లక్ష్మారెడ్డి, శ్రీకాంత్, నరేందర్, భరత్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా కాంగ్రెస్

- జాతీయ స్థాయిలోనూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు చేస్తాం
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

బిచ్కుంద: నిరుపేదలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. బుధవారం బిచ్కుందలోని బండాయప్ప ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జాతీయ స్థాయిలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలు చేస్తామని పేర్కొన్నారు. ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పిస్తామన్నారు. గత ప్రభుత్వాలు వైద్య సదుపాయాల కల్పనలో విఫలమయ్యాయని ఆరోపించారు. ఆస్పత్రులలో అవసరమైన మేర వైద్యులు, సిబ్బందిని నియమించలేదన్నారు. అందరికీ నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల్లో ఇందరమ్మ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. పేద వారికి సంక్షేమ పథకాలు అందేవిధంగా ఈ కమిటీలు చూడాల్సి ఉంటుందన్నారు. దేశానికి, రాష్టానికి బీజేపీ చేసిందేమీ లేదని విమర్శించారు. లెండి ప్రాజెక్టు, నాగమడుగు ఎత్తిపోతల పథకాలను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

బీబీ పాటిల్ చేసిందేమీ లేదు..

ఎంపీగా రెండుసార్లు గెలిపించిన ప్రజలకు బీబీ పాటిల్ చేసిందేమీ లేదని కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ విమర్శించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడే ఎస్ఎస్‌ఏ రోడ్డును నేషనల్ హైవేగా గుర్తించారన్నారు. ఇప్పుడు దానిని నాలుగు లేన్లుగా మార్చారని పేర్కొన్నారు. బీర్కూర్, కుర్లా మంజీర నదిపై బ్రిడ్జి మంజూరు చేయించిందీ తానేనన్నారు. కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి కాకుండా ముందునుంచి కాంగ్రెస్ జెండా మోసిన వారికే ప్రాధాన్యత ఇస్తామని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి విష్ణు, నాయకులు కాసుల బాల్‌రాజ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కై లాస్ శ్రీనివాస్, నాయకులు మల్లికార్జునప్ప షెట్కార్, విఠల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వినోద్, పాషా పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలను పరిష్కరించాలి

- సీఎస్ శాంతి కుమారి ఆదేశం



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

కామారెడ్డి క్రైం: తాగునీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేకరించిన ధాన్యానికి చెల్లింపులు సకాలంలో జరిగేలా చూడాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలకు మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

అధికారులు పర్యవేక్షించాలి

నీటి ఎద్దడి లేకుండా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. డివిజన్ల వారీగా తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాల వివరాలు తెలుసుకున్నారు. అధికారులు సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జెడ్పీ సీఈవో చందర్ నాయక్, డీపీవో శ్రీనివాస్, డీపీవో భాగ్యలక్ష్మి, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం నిత్యానంద్, డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, పంచాయతీ రాజ్ ఈఈ సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంతానం కోసం పుత్రకామేష్టి యాగం



సాక్షి,హైదరాబాద్: నవమితో పాటు పుష్యమీ నక్షత్రం కలిసివస్తున్న ఈనెల 17న మెదక్ జిల్లా నర్సాపూర్‌లో పుత్రకామేష్టి యాగం నిర్వహిస్తున్నట్లు సువిజ్ఞాన ఆశ్రమం నిర్వాహకులు సత్యవీర్ గురూజీ తెలిపారు. మారిన జీవన విధానాలతో సంతానలేమి సమస్యగా మారిన నేపథ్యంలో ప్రత్యేకంగా ఆడ, మగ బిడ్డల సంతానం కలిగేందుకు అనుభవజ్ఞులైన వైద్యుల ఆధ్వర్యంలో పుత్రకామేష్టి యాగం నిర్వహిస్తామని తెలిపారు. సంతానం కోసం ఎదురుచూస్తున్న వారు తమ వివరాలను 92488 28666 లేదా 7981750006 నెంబర్లలో నమోదు చేసుకోవాలని సత్యవీర్ గురూజీ కోరారు.

తాడ్వాయిలో కబడ్డీ పోటీలు

తాడ్వాయి: తాడ్వాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల12 నుంచి జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు మహావీర్‌సేన అధ్యక్షుడు చైతన్య గౌడ్ తెలిపారు. మహాత్మ జ్యోతిబా పూలే, అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 12 నుంచి 14 వరకు పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల జట్లు పేరు నమోదు చేసుకోవాలన్నారు. ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ రూ.25 వేలు, తృతీయ బహుమతి రూ.పది వేలు అని తెలిపారు. వివరాల కోసం రమేశ్‌రెడ్డి 8096353545, ప్రీతం 8341188064 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నెమలిని రక్షించిన గ్రామస్తులు



రామారెడ్డి: మండలంలోని రంగంపేటలో బావిలో పడిపోయిన నెమలిని గ్రామస్తులు కాపాడి అటవీ శాఖ సిబ్బందికి అప్పగించారు. గ్రామానికి చెందిన బోర్ర గౌడ్ వ్యవసాయ బావిలో బుధవారం నెమలి చిక్కుకోగా గ్రామస్తులు సురేందర్‌సింగ్, బోర్రాగౌడ్ బయటకు తీశారు. అనంతరం అటవీశాఖ సెక్షన్ అధికారి జయశ్రీ, సిబ్బంది శ్రీధర్‌కు అప్పగించారు. వారు దానిని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

ఘనంగా హోమియో దినోత్సవం



కామారెడ్డి అర్బన్: హోమియోపతి పితామహుడు డాక్టర్ సామ్యూల్ హనీమాన్ జయంతి సందర్భంగా బుధవారం కామారెడ్డి ఆయుష్ ఆస్పత్రిలో ప్రపంచ హోమియో దినోత్సవం నిర్వహించారు. హనీమాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డాక్టర్ విజయలక్ష్మి, జి దేవయ్య, కీర్తన, ఫార్మాసిస్ట్ శ్రీనివాస్, జ్యోత్స్న, పారా మెడికల్ సిబ్బంది రాజన్న, ప్రసాద్, చంద్రకళ, శోభ పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



మర్కల్‌లో మాట్లాడుతున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

దోమకొండ: హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో ఉమ్మడి దోమకొండ మండల బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారంటీలను అమలు చేయలేదని, ప్రజలు ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఉన్నారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్‌కుమార్‌ను గెలిపించుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పరికి ప్రేంకుమార్, దోమకొండ ఎంపీపీ కానుగంటి శారద, బీబీపేట ఎంపీపీ బాలమణి, సీడీసీ మాజీ చైర్మన్ ఐరేని నర్సయ్య తదితరులున్నారు.

కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే..

సదాశివనగర్: కాంగ్రెస్, బీజేపీలు దొందు దొందేనని అసెంబ్లీ మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మర్కల్ అశోక్ గార్డెన్స్‌లో సదాశివనగర్, రామారెడ్డి మండలాల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లలో ఎల్లారెడ్డిని అభివృద్ధి చేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే సురేందర్‌కు దక్కుతుందన్నారు. కానీ ప్రతిపక్ష నాయకులు ఎల్లారెడ్డిలో ఏం అభివృద్ధి జరగలేదని చెప్పడం సిగ్గు చేటన్నారు. ఇలాంటి నాయకులకు కర్రుకాల్చి వాతలు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఏం అభివృద్ధి చేశారని ఓట్ల కోసం ప్రజల ముందుకు వెళ్తారని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. బీజేపీ నాయకులు హిందూ మతాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. రాముడు అందరికి దేవుడనే విషయం మర్చిపోవద్దన్నారు. బీఆర్‌ఎస్ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తు ఓట్లు అడగాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ఒక్కసారి అవకాశం ఇస్తే.. అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, మహేందర్ రెడ్డి, రవీందర్ గౌడ్, ఎంపీపీ అనసూయ, మోహినొద్దిన్, సాయిరెడ్డి, రాజేశ్వర్ రావు, గడీల భాస్కర్, బద్దం శ్రీనివాస్ రెడ్డి, మర్కంటి బుచ్చయ్య, రాంరెడ్డి, పడిగెల శ్రీనివాస్, నారాయణ రెడ్డి, ప్రసాద్ గుప్తా పాల్గొన్నారు.

జిల్లా కోర్టును ప్లాస్టిక్ రహితంగా మార్చాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా కోర్టును ప్లాస్టిక్ రహిత కోర్టుగా మార్చేందుకు ప్రతి ఒకరూ సహకరించాలని జిల్లా జడ్జి సునీతా కుంచాల అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో బుధవారం ఉద్యోగులు, పోలీసులు, న్యాయవాదులకు క్లాత్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. ప్లాస్టిక్‌తో వాతావరణానికి ముప్పు వాటిల్లుతుందని, భవిష్యత్ తరాలకు ఇబ్బందులు కలుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. అనంతరం వైద్యశిబిరాన్ని న్యాయమూర్తి ప్రారంభించగా, కోర్టు సిబ్బంది, న్యాయవాదులతోపాటు ఇతరులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు.

చలివేంద్రం ప్రారంభం

జిల్లా కోర్టు వద్ద వెలమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని న్యాయమూర్తి సునీతా కుంచాల ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, వెలమసంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఎంఐఎం ‘బీ’ టీమ్

- ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి ఐదేళ్లలో చేసిన అభివృద్ధి ఏది?
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్



మాట్లాడుతున్న దినేశ్ కులాచారి

సుభాష్‌నగర్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎంఐఎంను గెలిపించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, మిగతా నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు మైనార్టీ ఓట్లు వేయించి ఎంఐఎం మద్దతు తెలుపుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌కులాచారి ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఎంఐఎం ‘బీ’ టీమ్ అని అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎంఐఎం ఎమ్మెల్యేల రహస్య ఒప్పందం బయటపడిందన్నారు. మతతత్వ పార్టీ ఎంఐఎంతో కాంగ్రెస్ చేతులు కలిపి మత రాజకీయాలు చేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. బీజేపీ మూల సిద్ధాంతమైన అంత్యోదయ చిట్టచివరి వ్యక్తికి కూడా అభివృద్ధి ఫలాలు అందేలా చూస్తోందన్నారు. ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి ఐదేళ్లలో ఎలాంటి అభివృద్ధి పనులు చేశారో చెప్పాలని, ఏ నియోజకవర్గానికి ఎన్ని నిధులు కేటాయించారని ప్రశ్నించారు. వరికి రూ.500 బోనస్ ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఎన్నికల తరువాత విస్మరించిందని విమర్శించారు. గత ఎన్నికల సందర్భంగా ధర్మపురి అర్వింద్ ఇచ్చిన మాట ప్రకారం పసుపు బోర్డు తీసుకొచ్చారని, ఎన్నో అభివృద్ధి పనులు చేశానని గుర్తుచేశారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఏడు ఆర్‌వోబీలు, రెండు కేంద్రీయ విద్యాలయాలు తీసుకొచ్చారన్నారు. అర్వింద్‌కు జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్ అసలు పోటీయే కాదని, పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్‌లో మరోసారి కాషాయ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తంచేశారు. గద్దె భూమన్న, పడిగెల వెంకటేశం, శ్రీనివాస్‌శర్మ, పద్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బద్దం కిషన్, దొంతుల రవి, రోషన్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఇప్పకాయల కిశోర్ పాల్గొన్నారు.

ఎడ్ల బండ్లకు బహుమతులు



భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో ఉగాది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఎడ్ల బండ్ల ప్రదర్శనలో సుందరంగా అలంకరించిన ఎడ్ల బండ్ల సంఘాల వారికి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం బహుమతులను ప్రధానం చేశారు. ప్రథమ బహుమతిని నాగార్తి సంఘం వారికి ద్వితీయ బహుమతిని పెరుక సంఘం వారికి తృతీయ బహుమతిని రెడ్డిగారి సంఘం వారికి అందజేశారు.అలాగే చిన్న బండ్లను ప్రదర్శించిన వారికి కోలాటం వారికి ప్రత్యేక బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు మద్ది సూర్యం, ఉపాధ్యాక్షులు ఏలేటి రమేష్, చేపూరి రమేష్, ఒడ్డె శశి,ప్రధానకార్యదర్శి నాగార్తి భూంరెడ్డి, కోషాధికారి తక్కళ్ల శ్యామ్ రెడ్డి, సహాయకార్యదర్శులు కుడిక్యాల హరిక్రిష్ణ, కడారి , నాగరాజులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



పెద్దకొడప్‌గల్: పోలీస్ విధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై కోనారెడ్డి అన్నారు. బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఎస్సై కోనారెడ్డి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. షీ టీం,సైబర్ నేరాలపై వివరించారు. పోలీసులు రవి, రమేశ్, గోరి, స్వప్న, ఉపాధ్యాయులు రాములు, విఠల్ పాల్గొన్నారు.

మార్వాడీల గన్‌గోర్ ప్రారంభం

మద్నూర్: మండల కేంద్రంలో మార్వాడీ సమాజ్ ఆధ్వర్యంలో బుధవారం గన్‌గోర్ వ్రతాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మర్వాడీ మహిళలు స్థానిక బాలాజీ మందిరంలో పూజలు నిర్వహించి గౌరమ్మలను ప్రతిష్ఠించారు. మూడు రోజుల పాటు గౌరమ్మకు పూజలు చేస్తామని వారు తెలిపారు.

లెక్చరర్‌కు డాక్టరేట్

ధర్పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతిశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న సీహెచ్ రాంచందర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ‘మెదక్ జిల్లాలో రాజకీయాలు, రాజకీయ నాయకుల విధివిధానాలు’ అనే అంశంపై పరిశోధన చేశారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్‌కు చెందిన రాంచందర్ గత పది సంవత్సరాలుగా ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా సేవలందిస్తున్నారు. డాక్టరేట్ పొందిన రాంచందర్‌ను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

ఐదు గుడిసెలు దగ్ధం

- కొండాపూర్ తండాలో భారీ అగ్ని ప్రమాదం
- రూ.18.33 లక్షల ఆస్తినష్టం



దగ్ధమవుతున్న నివాసపు గుడిసెలు

లింగంపేట(ఎల్లారెడ్డి): సుడిగాలి కారణంగా విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలి మంటలు చెలరేగడంతో ఐదు నివాసపు గుడిసెలు దగ్ధమయ్యాయి. మండలంలోని కొంకొండాపూర్ తండాలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఐదు కుటుంబాలు సర్వం కోల్పోయి రోడ్డునపడ్డాయి. బంగారం, వెండి, నగదుతోపాటు బియ్యం, ధాన్యం, దుస్తులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.18.33 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు ఆర్ఐ బాలయ్య తెలిపారు. మంజ ప్రకాశ్‌కు చెందిన ఐదు తులాల బంగారం పుస్తెల తాడు, తులన్నర వెండి, రూ.20వేల నగదు, 20 బస్తాల ధాన్యం, మంజ నర్సోడ్‌కు చెందిన రెండు తులాల పుస్తెలతాడు, రూ.50 వేల నగదు, వెండి కడియాలు, మంజ పర్తాశ్‌కు చెందిన మూడు తులాల పుస్తెల తాడు, వెండి కడియాలు, రూ.లక్ష నగదు, మంజ నారాయణకు చెందిన రెండు తులాల బంగారు పుస్తెల తాడు, వెండి కడియాలు, రూ.50 వేల నగదు, మంజ బాదల్‌సింగ్‌కు చెందిన మక్కలు, డీసీఎం ట్రాలీ పూర్తిగా కాలిపోయాయని ఆర్ఐ తెలిపారు.

ఇంటికే సీతారాముల తలంబ్రాలు

- భద్రాచలం కల్యాణ తలంబ్రాలను అందించేందుకు ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవలు
- రెండేళ్లుగా ఆఫ్‌లైన్ సేవలు
- ఈసారి ఆన్‌లైన్ ద్వారా కూడా బుకింగ్ చేసుకునే అవకాశం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జగదభిరాముడు, సీతమ్మ తల్లి కల్యాణ తలంబ్రాలను భక్తుల ఇంటికే నేరుగా అందించేందుకు ఆర్టీసీ లాజిస్టిక్స్ వరుసగా మూడో ఏడాది సేవలను అందజేస్తోంది. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణం ఈ నెల 17న వైభవంగా జరుగనుంది. కల్యాణం కోసం రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు సేంద్రియ పద్ధతిలో పండించి, గోటితో వలిచిన కోటి తలంబ్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. పైగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా పట్టువస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను సమర్పిస్తూ వస్తోంది. అదేవిధంగా వసంత పంచమి రోజు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ క్రతువులో భాగంగా తలంబ్రాలు కలిపే కార్యక్రమానికి భక్తులతో కలిసి శ్రీకారం చుడతారు. ఇలా అన్ని తలంబ్రాలను కలిపి సీతారాముల కల్యాణంలో ఉపయోగిస్తారు. భారీస్థాయిలో కలిపిన ఈ తలంబ్రాలను తీసుకెళ్లేందుకు దేశంతో పాటు విదేశాల్లోని వారూ ఇష్టపడతారు. ఈ తలంబ్రాలు ఇంట్లో పెట్టుకుంటే శుభం కలుగుతుందని భక్తుల విశ్వాసం. చాలామంది తమ పిల్లల వివాహాలకు వాడే తలంబ్రాల్లో భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాలను కలుపుకునేందుకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు.

రూ.151కే..

తలంబ్రాలను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోని భక్తుల ఇళ్లవద్దకే వెళ్లి అందించేందుకు ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం మూడేళ్ల క్రితం శ్రీకారం చుట్టింది. గత రెండేళ్లలో ఆర్టీసీ ఆఫ్‌లైన్ బుకింగ్స్ ద్వారా తలంబ్రాలను అందించే సేవలను చేసింది. ఈ ఏడాది మాత్రం ఆఫ్‌లైన్ బుకింగ్స్‌తో పాటు మొదటిసారి ఆన్‌లైన్ బుకింగ్స్ సదుపాయం ప్రారంభించింది. ముత్యాలతో కూడిన ఒక్క ప్యాకెట్ తలంబ్రాలకు రూ. 151 ధరను నిర్ణయించారు. ప్రతి ఒక్క వ్యక్తి ఆన్‌లైన్‌లో మెయిల్ ఐడీ ద్వారా 100 ప్యాకెట్లను బుక్ చేసుకునే అవకాశం కల్పించింది. ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం www. tsrtclogistics. in వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవాలి. అదేవిధంగా డిపోల్లోని లాజిస్టిక్స్ కౌంటర్లు, బస్‌స్టేషన్లు, కొన్ని పెద్ద మండల కేంద్రాల్లో లాజిస్టిక్స్ ఏజెంట్ల వద్ద సైతం బుక్ చేసుకునే సదుపాయం కల్పించారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఉమ్మడి జిల్లాలో భద్రాచలం సీతారాముల కల్యాణ తలంబ్రాల కోసం నిజామాబాద్–1 డిపోలో 9154298727, నిజామాబాద్–2 డిపోలో 7396889496, ఆర్మూర్ డిపోలో 9550232626, బోధన్ డిపోలో 9014296638, బాన్సువాడ డిపోలో 9154298729, కామారెడ్డి డిపోలో 9154298730 నంబర్లలో సంప్రదించాలి. అదేవిధంగా భీమ్‌గల్, నందిపేట, బిచ్కుంద, పిట్లం, మద్నూర్, ధర్పల్లి, వర్ని, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఎల్లారెడ్డి తదితర ప్రాంతాల్లో లాజిస్టిక్స్ ఏజెంట్లను సంప్రదించవచ్చు.

– జానీరెడ్డి, నిజామాబాద్ రీజినల్ మేనేజర్
శ్రీనివాస్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్

అధికారంలో ఉన్నామని మురిసిపోవద్దు



భిక్కనూరులో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

భిక్కనూరు : కొందరూ కాంగ్రెస్ నేతలు అధికారంలో ఉన్నామని విర్ర వీగుతున్నారని ప్రజలు వారికి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని బీఆర్‌ఎస్ మండల ప్రధానకార్యదర్శి అత్తెల్లి శ్రీనివాస్, సిద్ధరామేశ్వరాలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తున్కి వేణు అన్నారు. వారు బుధవారం భిక్కనూరులో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ప్రజల మనిషి అన్నారు. ప్రజలకు మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇకనైనా తప్పుడు ఆరోపణలు, విమర్శలు మానాలన్నారు. ఈ సమవేశంలో ఎంపీటీసీల ఫోరం మండల కన్వీనర్ ద్యావర సాయిరెడ్డి, విండో చైర్మన్ భూంరెడ్డి, మాజీ విండో చైర్మన్ వంగేటి చిన్న నర్సరెడ్డి, విండో వైస్ చైర్మన్ ముచ్చర్ల రాజిరెడ్డి, ఎంపీటీసీ కోదురి సాయగౌడ్, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అంబల్ల మల్లేషం తదితరులున్నారు.

రసవత్తరంగా కుస్తీపోటీలు



నస్రుల్లాబాద్‌లో తలపడుతున్న మల్లయోధులు



నస్రుల్లాబాద్: నస్రుల్లాబాద్‌లో ఉగాది పండుగను పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధులు పోటీల్లో పాల్గొన్నారు. కొబ్బరి కాయ కుస్తీ నుంచి రూ.2000 వరకు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి నగదు అందించి సన్మానించారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



టాక్లీ శివారులో దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్

బోధన్/ వర్ని(చందూర్)/ రుద్రూర్: ఇటీవల కురిసిన వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ పరిశీలించారు. సాలూర మండలంలోని సాలంపాడ్, కుమ్మన్‌పల్లి, చందూర్ మండల కేంద్రంలో, పొతంగల్ మండలం టాక్లీ శివారులో దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయాధికారి మండల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పంటల పరిశీలన చేపట్టారు. పంట నష్టం వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారులు, సొసైటీ సీఈవోలు, సిబ్బంది, రైతులు ఉన్నారు.

ఎడపల్లి ఎంపీవోపై లైంగిక వేధింపుల కేసు

ఖలీల్‌వాడి/ఎడపల్లి: ఎడపల్లి ఎంపీవో సుభాష్ చంద్రబోస్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదైనట్లు ఆలస్యంగా తెలిసింది. నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎడపల్లి మండలానికి చెందిన ఓ మహిళ కార్యదర్శిని లైంగికంగా వేధించినందుకు ఎంపీవోను నాలుగు రోజుల క్రితం రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది. ఈ విషయమై సీఐ నరహరి, ఎస్సై ప్రవీణ్‌ను వివరణ కోరగా.. లైంగిక వేధింపుల కేసు వాస్తవమేనన్నారు. సదరు ఎంపీవో గతంలో ఓ జిల్లా ఉన్నతాధికారి వద్ద పని చేసిన సమ యంలో ఉన్న పరిచయాలతో సిబ్బందిని ఇబ్బందులకు గురి చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

పేకాట స్థావరంపై దాడి

ఆర్మూర్ టౌన్: ఆర్మూర్ మండలం అంకాపూర్ శివారులోని వృద్ధాశ్రమం సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం దాడి చేశారు. తొమ్మిది మందిని అరెస్టు చేసి రూ.10వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దాడిలో ఎస్సై అంజమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకరి అదృశ్యం



మేకల చార్లి

మోపాల్: మండలంలోని కులాస్‌పూర్‌కు చెందిన మేకల చార్లి అదృశ్యమైనట్లు ఎస్సై గంగాధర్ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆటో నడుపుతూ జీవిస్తున్న చార్లికి భార్య కవిత, ముగ్గురు పిల్లలు ఉన్నారు. 15రోజుల క్రితం బట్టలు సర్దుకుని ఇంటి నుంచి వెళ్లిన చార్లి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో భార్య కవిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి



రవి మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పెద్దవాగు పక్కన ఉన్న చేపల కుంటలో చేపలు పట్టేందుకు వెళ్లిన అజ్మీర రవి(24) అనే వ్యక్తి బురదలో చిక్కుకొని మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గాంధారి మండలం రామలక్ష్మణ్‌పల్లి తండాకు చెందిన రవి లింగంపేటలో ఓ వ్యక్తి వద్ద శానిటేషన్ పనులు చేస్తున్నాడు. ఈనెల 8వ తేదీన రవి వద్దకు అతడి తల్లి అజ్మీరా భూలి రాగా, ఇద్దరూ కలిసి పెద్దవాగు వద్ద ఉన్న నారాగౌడ్ చేపలకుంటలో చేపలను వేటాడేందుకువెళ్లారు. ఈ క్రమంలో రవి బురదలో చిక్కుకొని ఊపిరాడక మృతి చెందాడు. పోలీసులు బుధవారం ఉదయం ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. కూలీలకు గాయాలు

రామారెడ్డి: మండలంలోని గిద్దెరోడాం సమీపంలో బుధవారం ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో మండల కేంద్రానికి నలుగురు కూలీలకు గాయాలయ్యాయి. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గిద్దెనుంచి రామారెడ్డికి వస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఈ ఘటనలో శ్రీకాంత్, చతరబోయిన సతీశ్, లచ్చపేట లింబయ్య, భూంపల్లి రాములు చేతులు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరి చేతులు విరిగినట్లుగా తెలిసింది. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కంటైనర్‌ను ఢీకొన్న బైక్

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కూతురికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. పడకల్ తండాకు చెందిన కోల బాపుసింగ్ తన కూతురి ఆధార్‌కార్డు నమోదు కోసం ఆర్మూర్‌కు వెళ్లాడు. అక్కడ పని పూర్తయిన తరువాత పడకల్ తండాకు తిరిగి వస్తుండగా ముందు వెళ్తున్న కంటైనర్‌ను డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. ఈ క్రమంలో కంటైనర్‌ను బైక్‌ఢీకొని బాపుసింగ్‌తోపాటు అతడి కూతరు ఐశ్వర్యకు స్వల్పగాయాలయ్యాయి. ఘటనాస్థలాన్ని ఎస్సై తిరుపతి పరిశీలించారు. గాయాలపాలైన వారిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రూ.5.45 లక్షలు పట్టివేత



సీజ్ చేసిన నగదును చూపుతున్న పోలీసులు

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని వెల్గనూర్ చెక్ పోస్టు వద్ద పోలీసులు బుధవారం రూ.5.45లక్షల నగదును సీజ్ చేశారు. ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం వాహనాలను తనిఖీ చేస్తుండగ, హైదరాబాద్ నుంచి నాందెడ్ వైపునకు వెళ్తున్న బొలెరో వాహనంలో రూ.5.45 లక్షల నగదును గుర్తించారు. నగదు తరలిస్తున్న సమీర్ హుస్సేన్ సాబ్ నగదుకు సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

సలాబత్‌పూర్ వద్ద రూ.లక్ష..

మద్నూర్(జుక్కల్): మండలంలోని తడి హిప్పర్గాకు చెందిన కంకర్నె సూర్యదాస్ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా బుధవారం రూ.లక్ష నగదు తరలిస్తుండగా పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. సూర్యదాస్ కారులో చెక్‌పోస్టు మీదుగా వెళ్తుండగా తనిఖీ చేసి రూ.లక్ష సీజ్ చేశామన్నారు.

పీడీఎస్ బియ్యం వేలం

ఇందల్వాయి: దాడుల్లో పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని డిచ్‌పల్లి మండలం సాంపల్లిలోని సాయిరామ్ రైస్‌మిల్లులో ఈనెల 16వ తేదీన బహిరంగ వేలం వేయనున్నట్లు తహసీల్దార్ వెంకట్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 77.86 క్వింటాళ్ల బియ్యాన్ని మంగళవారం ఉదయం 11గంటలకు వేలం వేస్తామని, పాల్గొనదలచిన వారు రైస్ మిల్లు వద్దకు రావాలని సూచించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

ఖలీల్‌వాడి: మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరికి న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తెలిపారు. మంగళవారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 12 మందిని మార్నింగ్ కోర్టులో హాజరుపరిచామన్నారు. 10 మందికి రూ.9,800 జరిమానా విధించిన న్యాయమూర్తి.. నగరానికి చెందిన ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, హెల్మెట్ ధరించాలని సూచించారు.